'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

మళ్లీ ఉగ్రవాద బెడద

రెండు దశాబ్దాలుగా తగ్గుముఖం పట్టిన పాక్ ప్రేరేపిత కశ్మీర్ ఉగ్రవాదం మళ్లీ జడలు విప్పుతున్నది. రోజు విడిచి రోజు అన్నట్టుగా ఉగ్రదాడులు జరుగుతున్నాయి. భద్రతాదళ జవాన్లు తరచుగా ఈ దాడుల్లో అమరులవుతున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. సాయుధ బలగాలే కాకుండా సామాన్య పౌరులనూ ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన రోజే కశ్మీర్‌లోని రియాసీ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో 9 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. టెర్రరిస్టుల్లో అమానుషత్వం లోలోతుల్లోకి పడిపోతున్నట్టు ఇది సూచిస్తున్నది. ఎడతెరిపి లేకుండా దాడులతో తెగబడుతూ భద్రతా దళాలకు ఉగ్రవాదులు సవాల్ విసురుతుండటం ఆందోళన కలిగిస్తున్నది.

1990-2000 సంధికాలంలో కశ్మీర్‌లో టెర్రరిజం పెట్రేగిపోయిన సంగతి తెలిసిందే. 2003లో ఆపరేషన్ సర్ప వినాశ్‌తో దాన్ని అణచివేశారు. దాదాపుగా అణగిపోయిందనుకున్న ఉగ్రవాదం మళ్లీ ఇటీవలి కాలంలో ఎలా, ఎందుకు విజృంభిస్తున్నదనే ప్రశ్న దేశ ప్రజలను వేధిస్తున్నది. భద్రతా నిపుణులు ప్రధానంగా ఇందుకు రెండు కారణాలు ఎత్తి చూపుతున్నారు. మొదటిది, చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరగడంతో సైనిక దళాల మోహరింపు ఆ వైపు అధికమై కశ్మీర్‌లో తగ్గిపోవడం. ఇది నిఘా, గూఢచార వ్యవస్థపైనా ప్రభావం చూపిందని అంటున్నారు. రెండవది, అంతర్గత సమస్యల వల్ల పాకిస్థాన్‌లో నిస్పృహ పెరిగిపోతూ ఉండటంతో కొత్త కొత్త ఉగ్రవాద సంస్థలు పుట్టుకురావడం. సరిహద్దులకు ఆవల నుంచి వచ్చేవారే కాకుండా స్థానిక యువతను కూడా ఉగ్రవాదులుగా మారుస్తున్నట్టు వినవస్తున్నది. సైనిక వాహనాలపై పొంచి ఉండి దాడులు చేస్తుండటంతో జవాన్లు అధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. కట్టుదిట్టమైన నిఘా మధ్య తిరిగే ఈ వాహనాలపై గురితప్పకుండా దాడి చేయడం అంత చిన్న విషయమేమీ కాదు. ఏదేమైనప్పటికీ ఉగ్రదాడుల్లో నిత్యం సుశిక్షితులైన సైనికులు, అమాయక పౌరులు మరణిస్తుండటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు.

కశ్మీర్ ఉగ్రవాదాన్ని అణివేసేందుకు బలగాలను పెంచడంతో పాటుగా బహుముఖ వ్యూహాన్ని అమలు చేయాల్సి ఉంటుందని చెప్పక తప్పదు. ఇందుకు అన్నిస్థాయుల్లో సత్వర, నిర్ణయాత్మక కార్యాచరణ రూపొందించుకోవడం తక్షణావసరం. ప్రామాణికమైన ఆచరణ నియమావళిని కఠినంగా పాటించాల్సి ఉన్నది. అదేవిధంగా పాక్ సరిహద్దుల్లో ఎక్కడైనా చిన్నాచితకా నిఘా లోపాలుంటే వాటిని సరిదిద్దేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. 370 అధికరణం రద్దుతో కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయింది. అంతేకాకుండా రాష్ట్ర హోదా కూడా రద్దయిపోయి, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. లడఖ్ పోను మిగిలిన జమ్మూకశ్మీర్ ప్రాంతానికి తిరిగి రాష్ట్ర హోదా కల్పిస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరలేదు. అసెంబ్లీని ఏర్పాటు చేసి, ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియదు. ఇది స్థానిక ప్రజల్లో కొంత అసంతృప్తికి దారితీసే అంశమే. భద్రతా యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతో పాటుగా భాగస్వాములందరినీ కలుపుకొని పోతే గానీ ఉగ్రవాద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు.

రైతన్నకు కాంగ్రెస్ కుచ్చుటోపి!

తెలంగాణ విజయ్
94919 98702

'ఆనాటి రోజులు తెస్తాడూ మన రేవంతన్న' అంటూ ఎన్నికలప్పుడు పాటలు పాడుతూ కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చింది. ఆ పాటకు తగ్గట్టుగానే ఆనాటి చీకటి రోజులను తీసుకువచ్చారు ముఖ్యమంత్రి రేవంత్. ఎన్నికల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు, అలవిగాని హామీలతో మభ్యపెట్టిన రేవంత్.. నమ్మి ఓట్లేసిన జనాల నోట్లో మట్టికొట్టారు. గత సర్కార్ అమలుచేసిన సంక్షేమ పథకాలన్నింటిని పక్కనపెట్టేశారు. ఒకటి, అరా పథకాలు అమలు చేస్తున్నా.. నిబంధనలు, మార్గదర్శకాల పేరుతో కొర్రీలు పెడుతూ నిజంగానే మళ్లీ తెలంగాణలో చీకటి రోజులు తీసుకొస్తున్నారు. 'వెంటనే రుణాలు తీస్కోండి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తా'నని డంబాచారాలు పలికిన రేవంత్.. నేడు రైతులకు కుచ్చుటోపీ పెడుతున్నారు.

రుణమాఫీ చేస్తానంటూ దేవుళ్ల మీద ఒట్టేసిన ముఖ్యమంత్రి రేవంత్.. ఆ ఒట్లను గట్టెక్కించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు నిబంధనల పేరిట కొర్రీలు విధిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారు. ఇవి పూర్తిగా రుణమాఫీ ఎగ్గొట్టేందుకు విడుదల చేసిన మార్గదర్శకాలే. రేషన్‌కార్డుతో ముడిపెట్టడమంటే కుటుంబంలో ఒకరికి మాత్రమే రుణమాఫీ చేస్తామన్నట్టే. ఇది అసంబద్ధమైన నిబంధన. ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పటివరకు ఏ ఒక్కరికీ రేషన్‌కార్డు మంజూరు చేయలేదు. వాస్తవానికి తెలంగాణలో కొన్నేండ్లుగా రేషన్‌కార్డులు జారీ కాలేదు. చాలా కుటుంబాల్లో అన్నదమ్ములకు వివాహాలు జరిగి, భూ పంపకాలు కూడా జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో భూమి ఉండి, రేషన్‌కార్డు విడిగా లేనివారు నష్టపోయే ప్రమాదం ఉంది. అంతేకాదు, ఇంట్లో పరిస్థితి బాగోలేక, లేదా కుమార్తెల వివాహం కోసమో కొందరు రైతన్నలు భూములు అమ్ముకున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల కారణంగా అలాంటి రైతులు గతంలో తీసుకున్న రుణాలు మాఫీకి నోచుకోవు. దీంతో సదరు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది.

'నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టుగా రూ.2 లక్షలకు పైగా అప్పులున్న రైతులు అదనంగా ఉన్న రుణాన్ని ముందుగా చెల్లించాలని షరతు పెట్టారు. అలా చేస్తేనే రుణమాఫీ చేస్తామనడం విడ్డూరం. అసలు రుణం చెల్లించలేకనే రైతన్న ఇబ్బంది పడుతుంటే ముందు చెల్లిస్తేనే రుణమాఫీ చేస్తామనటం రైతును మళ్లీ అప్పుల ఊబిలో నెట్టేసే ప్రయత్నమే. పీఎం కిసాన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటామనటం సబబు కాదు. ఈ నిబంధన వల్ల సుమారు 38 లక్షల మంది రైతులు రుణమాఫీకి దూరమవుతారు. రాష్ట్రంలో 68 లక్షల మందికి పైగా రైతుబంధు అందుకుంటున్నారు. ప్రభుత్వం వద్ద సదరు రైతుల డేటా ఉంది. ఆ డేటాను కాదని, పీఎం కిసాన్‌ను పరిగణనలోకి తీసుకోవటం దేనికి సంకేతం? ఇది రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నంలో భాగం కాదా? అనేది రేవంత్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

మార్గదర్శకాల్లో రైతులను బురిడీ కొట్టించే మరో నిబంధన 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు అంటే సుమారు ఈ ఐదేండ్లలో తీసుకున్న రుణాలకే రుణమాఫీ వర్తిస్తాయనటం. 2018 డిసెంబర్‌కు ముందు రుణం తీసుకున్న రైతులు రైతులు కాదా? ఆ రైతులు కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదా? లేదా ఆ రైతులు తెలంగాణ బిడ్డలు కాదా? వాళ్లవి అప్పులు కావా? ఎన్నికల మ్యానిఫెస్టోలో కటాఫ్ తేదీని కాంగ్రెస్ పార్టీ పొందుపరచలేదు. అంతేకాదు, అసలు, వడ్డీ కలిపి రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కానీ, నేడు అందుకు విరుద్ధంగా కొర్రీలు పెడుతున్నది. ఇది రైతులను మోసం చేయడమే.

రీ షెడ్యూల్ చేసిన రుణాలను మాఫీ చేయబోమని చెప్పడం అవివేకమే. ముఖ్యమంత్రికి రైతన్నలపై ఏ మాత్రం ప్రేమ లేదని దీన్నిబట్టి అర్థమవుతున్నది. ఎందుకంటే, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు, కరువు కాటకాలు వచ్చినప్పుడు బ్యాంకులే రుణాలను రీషెడ్యూల్ చేస్తాయి. అంతే కాదు, మళ్లీ అన్నదాతలకు రుణం ఇస్తాయి. అది రైతు హక్కు. ఇది ఆర్‌బీఐ నిబంధన కూడా. రుణాన్ని రీషెడ్యూల్ చేశారంటేనే సదరు రైతు కష్టాల్లో ఉన్నట్టు. అలాంటి రైతన్నను ఆదుకోవాల్సింది పోయి, వారికి రుణమాఫీ చేయబోమని చెప్పడం బాధ్యతారాహిత్యమే.

సీఎం రేవంత్ 'ఓడదాటినాక బోడమల్లన్న' అన్నట్టు తాను ఒడ్డెక్కినాక రైతుల నడ్డివిరిచే ప్రయత్నం చేస్తున్నారు. గత కేసీఆర్ సర్కార్ మొదటి పర్యాయం 35.31 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.16,144 కోట్ల రుణాలను మాఫీ చేసింది. రెండో పర్యాయం 22.98 లక్షల మంది అన్నదాతలకు చెందిన రూ.13 వేల కోట్ల రుణాలను మాఫీ చేసింది. మొత్తంగా రూ.29,144 కోట్ల రుణాలను మాఫీ చేసింది. కానీ, నేటి రేవంత్ ప్రభుత్వం రుణమాఫీని ఎగ్గొట్టి రైతులకు టోపీ పెట్టేవిధంగా వ్యవహరిస్తున్నది.

> **రేవంత్ ప్రభుత్వం కొలువుదీరాక యాసంగిలో పంటలకు సాగునీరు లేక, కరెంట్ సరిగా రాక పంటలు ఎండి రైతన్నలు నష్టాల పాలయ్యారు. ఈ వానకాలంలోనూ సరైన వర్షాలు లేక పంట సాగు చేసే పరిస్థితి లేదు. ఈ క్రమంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్న రైతాంగానికి ఈ మార్గదర్శకాలు మరిన్ని చిక్కులను తెచ్చిపెడుతున్నాయి.**

ఈ నేపథ్యంలో పరిపాలన గాలికొదిలేసి రాజకీయ వలసలే పరమావధిగా భావిస్తూ రేవంత్ పూటకో ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు. సంక్షేమ పథకాలను అటకెక్కించి, ఆరు గ్యారంటీలను మరిచిపోయిన ఆయనపై ప్రజలు తిరగబడతారనే ఉద్దేశంతోనే అక్కరకు రాని మార్గదర్శకాలను విడుదల చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఈ మార్గదర్శకాలన్నీ అమలైతే సుమారు 60 శాతం మంది రైతులు రుణమాఫీకి దూరమవుతారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలి. అర్థం పర్థం లేని మార్గదర్శకాలను రద్దు చేసి అందరి రుణాలను మాఫీ చేయాలి. లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

సవరణ

2024, జూలై 16 మంగళవారం నాటి సంపాదకీయం పేజీలో 'జీవాత్మలు-ప్రేతాత్మలు' అనే వ్యాసం అచ్చయింది. ఈ వ్యాసకర్త రిటైర్డ్ సివిల్ సర్జన్ డాక్టర్ చెన్నమనేని హన్మంతరావు కాగా, ఆయనకు బదులుగా ఆర్థికవేత్త చెన్నమనేని హన్మంతరావు ఫొటో అచ్చయింది. పాఠకులు గమనించగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

- ఎడిటర్

ఫిరాయింపులపై దొందూ దొందే!

నాంచారయ్య మెరుగుమాల

> **తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను నేడు పాలకపక్షమైన కాంగ్రెస్ సమర్థించుకుంటున్న తీరు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరం. కేంద్రంలో ఎన్డీయే సంకీర్ణ కూటమికి నాయకత్వం వహిస్తున్న మరో జాతీయపక్షం బీజేపీ కూడా ఆయా రాష్ట్రాల రాజకీయ పరిస్థితులు, అక్కడి శాసనసభల్లో తన బలాన్ని బట్టి పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడుతున్నది. ఈ విషయంలో రెండు పార్టీలదీ అవధులు లేని అవకాశవాదమే.**

మహారాష్ట్రలో 2022లో ఫిరాయింపుల ద్వారా శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ సంకీర్ణ సర్కారును కూల్చివేసిన బీజేపీ.. కాంగ్రెస్‌లో చేరే తెలంగాణ ఎమ్మెల్యేలు తమ పదవికి రాజీనామా చేయాలని ఇప్పుడు సలహాలిస్తున్నది. దేశంలో పార్టీ ఫిరాయింపుల ద్వారా రాజకీయ అస్థిరత సృష్టించి, ప్రయోజనం పొందడంలో రెండు జాతీయ పార్టీలూ దేనికవే సాటి. దేశంలో చట్టసభలకు ఎన్నికైన సభ్యులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడేలా చేయడంలో మొదటినుంచీ ఈ జాతీయ పార్టీలది కీలకపాత్ర. దాదాపు 40 ఏండ్ల కిందట 1984, అక్టోబర్ 31న ఇందిరాగాంధీ హత్యకు గురికావడంతో రాజీవ్ గాంధీ అదేరోజు ప్రధాని అయ్యారు. ఇందిర మరణంతో లేచిన సానుభూతి పవనాలతో లబ్ధి పొందడానికి ఆయన రెండు నెలల్లోపే జరిపించిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 415 సీట్లను కైవసం చేసుకున్నది. అప్పుడు రాజీవ్ వయసు 40 ఏండ్లే. స్వార్థ రాజకీయాలే ఆలంబనగా నడిచే కాంగ్రెస్ పార్టీలో ఉన్న జిత్తుల మారి సీనియర్లు తన రాజకీయ అనుభవరాహిత్యాన్ని ఎక్కడ ఆసరా చేసుకొని దెబ్బతీస్తారనే భయం రాజీవ్‌కు పట్టుకున్నది. దాని ఫలితమే 8వ లోక్‌సభ ఎన్నికలైన నాలుగు నెలల్లోపే భారత పార్లమెంటు 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ఫిరాయింపు నిరోధక చట్టం ఆమోదించడం, వెంటనే అది అమల్లోకి రావడం జరిగిపోయాయి.

ఫిరాయింపు నిరోధక చట్టంలోని అనేక నిబంధనలు బలహీనంగా ఉండటం, పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కొన్ని సెక్షన్లు పలచనచేసేలా కనిపించడంతో నాటి ప్రతిపక్షాల్లో అత్యధిక పార్టీలు రాజీవ్ సర్కారు ప్రవేశపెట్టిన బిల్లును వ్యతిరేకించాయి. 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని ఫిరాయింపుల ద్వారా కాంగ్రెస్ కూలదోయడంతో పార్లమెంటులో ప్రధానంగా ప్రతిపక్షాల్లో టీడీపీ ఒక్కటే ఈ విషయంలో రాజీవ్ గాంధీకి మద్దతు పలకడం విశేషం. నాటి సోషలిస్టు నేత మధు లిమయే అన్నట్టు రాజీవ్ తెచ్చిన ఈ చట్టం ఫిరాయింపులను నిరోధించకపోగా ఫిరాయింపుల తీరు 'రిటైల్ నుంచి హోల్‌సేల్'కు మారినట్టయింది. పార్లమెంటులో ఫిరాయింపుల నిరోధక బిల్లును ప్రవేశపెట్టిన నాటి ప్రధాని రాజీవ్ మాటలు కోటలు దాటిపోయాయి. 1985 జనవరి 31న ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై 7 గంటలు చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని హోదాలో రాజీవ్ ప్రసంగిస్తూ, 'ఏ డేండ్ల నుంచీ ఈ బిల్లు కోసం మనం ఎదురుచూస్తున్నాం. ఈలోగా చాలా నష్టం జరిగిపోయింది. కనీసం కిందటేడైనా ఈ బిల్లు తీసుకొచ్చి చట్టం చేయలేకపోయాం. జరిగిందేదో జరిగింది. మన ప్రజా జీవితాన్ని ప్రక్షాళన చేయడానికి తొలి అడుగు ఈ ఫిరాయింపు నిరోధక బిల్లు' అని వర్ణించారు. వెంటనే రెండు సభలూ ఆమోదించాయి. కానీ, కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయపక్షాల చేతిలో పనిముట్టుగా మారిపోయింది. అంతకు ఏడేండ్ల ముందు ఫిరాయింపులతో గరిష్ఠ ప్రయోజనం పొందిన ఆయన తల్లి ఇందిరమ్మ చివరికి వాటితో విసుగెత్తిపోయి ఫిరాయింపు నిరోధక చట్టం తీసుకురావాలని ఆలోచించారు. ఆమె అనుకున్నదే తడవు అన్నట్టు ఆగమేఘాల మీద ఫిరాయింపులు నివారించే లక్ష్యంతో బిల్లును 1973లో నాటి కేంద్ర న్యాయశాఖ మంత్రి అశోక్ సేన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అయితే, పాలకపక్షం కాంగ్రెస్ పార్టీలో రాజకీయ సంకల్పం లేకపోవడంతో రెండేండ్లు ఆ బిల్లు చట్టసభల ఆమోదం పొందకుండా మురిగిపోయింది. ఈలోగా 1975, జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించడంతో ఇందిర తూతూ మంత్రంగా చేసిన ప్రయత్నం ఫలించలేదు. 1977-79 మధ్య కేంద్రంలో మొరార్జీ దేశాయి నాయకత్వాన ఏర్పడిన తొలి కాంగ్రెసేతర జనతా సర్కార్ హయాంలో జరిగిన ప్రయత్నం కూడా కార్యరూపం దాల్చలేదు.

కేంద్రంలో, రాష్ట్రాల్లో చట్టసభల సభ్యుల ఫిరాయింపుల వల్ల అత్యధికంగా రాజకీయ ప్రయోజనం పొందిన పార్టీ కాంగ్రెసే. ఈ చట్టం ఊసే లేని 1967-1983 మధ్యకాలంలో 2,700 మందికి పైగా చట్టసభల సభ్యులు ఫిరాయింపులకు పాల్పడ్డారు. వారిలో 1900 మంది వరకూ కాంగ్రెస్ పార్టీలోకే ఫిరాయించారు. ఇంకా, ఈ కాలంలో పార్టీలు మారిన 15 మంది ముఖ్యమంత్రుల్లో కనీసం 10 మంది కాంగ్రెస్ నాయకులేనని రికార్డులు చెప్తున్నాయి. 1980 జనవరిలో ఇందిరాగాంధీ రెండోసారి ప్రధాని అయ్యాక 1984లో డబ్బు సంచులతో ఫిరాయింపులు ప్రోత్సహించి ఆంధ్రప్రదేశ్, సిక్కింలో ప్రాంతీయపక్షాల సర్కార్లను కూల్చివేయడానికి చేసిన ప్రయత్నాలు చివరికి విఫలం కాగా, జమ్మూకశ్మీర్‌లో ఫారూఖ్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వాన్ని కుట్రలతో కూలదోసి, ఆయన బావ జీఎం షాను ఫిరాయించేలా చేసి గద్దెనెక్కించడంలో సఫలమైంది కాంగ్రెస్. దేశంలో ధనం, పదవులు ఆశచూపి అనేక రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలను ఫిరాయింపుల ద్వారా కూలదోసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. 1990ల చివరి నుంచి, 2014 నుంచి కేంద్రంలో అధికారం అనుభవించే స్థితిలో ఉన్న బీజేపీ కూడా ఫిరాయింపుల ద్వారా ప్రతిపక్షాలను ప్రధానంగా పెద్ద ప్రాంతీయపక్షాలను దెబ్బదీయడానికి కాంగ్రెస్ మార్గాన్నే ఎంచుకుందని రెండేండ్ల నాటి మహారాష్ట్ర పరిణామాలు చెప్తున్నాయి. ఏకంగా ముఖ్యమంత్రులనే ఇతర పార్టీల నుంచి దిగుమతి చేసుకునే విషయంలో కాంగ్రెస్, బీజేపీలు పోటీ పడుతున్నాయి. 1953, అక్టోబర్ 1న నాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుచేశాక కొత్త రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ లేదు. ఫలితంగా ప్రజా పార్టీ నాయకుడైన టంగుటూరి ప్రకాశంను చేర్చుకొని ముఖ్యమంత్రిని చేసింది కాంగ్రెస్. అలాగే ఈశాన్య రాష్ట్రమైన అసోంలో బీజేపీకి బలమైన మూలాలు, నాయకుడు లేని కారణంగా కాంగ్రెస్‌లో దాదాపు ఒకటిన్నర దశాబ్దాలు గడిపిన మాజీ మంత్రి హిమంతా బిశ్వశర్మ కాషాయపక్షానికి దిక్కయ్యాడు. చివరికి ఆయనే 2021లో బీజేపీ తరపున ముఖ్యమంత్రి అయ్యారు. 2015లో బీజేపీలో చేరి ఆరేండ్లలో శర్మ సీఎం కావడం పార్టీ ఫిరాయింపులపై కాషాయపక్షం వైఖరికి నిదర్శనం. చట్టసభల సభ్యుల ఫిరాయింపుల నివారణకు 1985 నాటి ఫిరాయింపుల నిరోధక చట్టం, తర్వాత ఏబీ వాజపేయి హయాంలో నాటి ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలు సరైన ఔషధం కాదని 2022లో మహారాష్ట్రలో శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని మహారాష్ట్ర వికాస్ అఘాడీ సర్కారును బీజేపీ కూల్చిన తీరు తేల్చిచెప్పింది. ఇంకా ప్రస్తుతం తెలంగాణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలోకి ప్రలోభాలు, బెదిరింపులతో చేర్చుకుంటున్న పద్ధతి చూస్తే ఈ జాతీయపక్షాలకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ఉన్న నమ్మకం ఎంతటి బలహీనమైనదో అర్థమవుతున్నది.

> **మహామహులు ఒక్క మాట అన్నారంటే ఆ మాటలో ఒక్కొక్క అక్షరానికి ఒక లక్ష వరహాల విలువ ఉంటుంది. 'అక్షర లక్షలు' అంటారే, అలాగ! ఈ మధ్య చంద్రబాబు గారు అటువంటి మాటలు చాలా అంటున్నారు. అంటే ఇది వరకు కూడా అన్నారనుకోండి. 2004లో అధికారం కోల్పయినా 2014 దాకా అటువంటి మాటలన్నీ వారు తమ ముఖ్యమంత్రిత్వం కింద జరిగిన గొప్ప గొప్ప పనుల గురించి ఉండేవి.**

కుబుసాలు విడుస్తున్నారు!

కనకదుర్గ దంటు
89772 43484

2014లో చంద్రబాబు ఏపీకి ముఖ్యమంత్రి అయ్యాక, కొన్నాళ్లు దూరవిద్య లాగ దూర పరిపాలన చేశారు. హైదరాబాద్‌లో ఎక్కువకాలం ఉంటూ లక్షల్లో ఆంధ్రప్రదేశ్‌లో అద్దె ఇళ్లల్లో ఉండి డబ్బులు ఖర్చు పెట్టినా, పదేండ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నా, అకస్మాత్తుగా అమరావతికి మారిపోయారు. కారణం చెప్తే తెలంగాణ ముఖ్యమంత్రి గారికి కోపం వస్తుందని చెప్పటం లేదు. క్షమించండి! అమరావతికి మకాం మార్చాక ఇక అమరావతి రాజధానిగా ఎలా వెలిగిపోతుందో, పోలవరం వారం వారం ఎంత అభివృద్ధి చెందేస్తోందో చెప్పటం తోటి ముఖ్యమంత్రి గారి కాలవ్యవధి అయిపోయింది. డైరెక్టర్ రాజమౌళి కూడా రాజధాని రూపకల్పనలో తోడ్పడినా, చివరికి చంద్రబాబు గారు పీఠం దిగేటప్పటికీ ఆ రాజధాని అవతార్ సినిమాలాగా ఊహల్లోనే ఉండిపోయింది. ఇంద్రుడి నగరం నుంచి కిందకి దిగలేదు! ఇప్పుడు బళ్లు మళ్లీ ఓడలయ్యాయి. మరి ప్రయాణం ఎలా ఉండబోతోంది. మొన్న శ్రీ నారా వారు అన్న మాట విన్నాక 'ఆహా' అనిపించింది. ఏమన్నారు?

'ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి చేసేసి, తెలంగాణ రాష్ట్రానికి వచ్చి, ఈ రాష్ట్రానికి పూర్వవైభవం తెస్తాను', అని చంద్రబాబు అన్నారు. అది వినగానే 1995 నుంచీ 2014 దాకా మన తెలంగాణ ఎలా ఉండిందో కక్కున గుర్తుకువచ్చింది. పూర్వ వైభవం అంటే ట్యాంక్‌బండ్ మీద ఉన్న 33 విగ్రహాల్లో, 30 ఆంధ్రా వాళ్లవి, 3 తెలంగాణ వాళ్లవి. కావాలా అలాంటి వైభవం? నిజానికి చంద్రబాబు గారు మొదటి టర్మ్‌లో ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి కాదు. 1994 డిశంబరులో రాష్ట్ర శాసనసభా ఎన్నికలలో నందమూరి తారకరామారావు గారు పార్టీని గెలిపించి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. అయితే పాపం వారికి ఏ శాపం ఉందో కానీ, మొట్టమొదటి సారి 1983లో ఎన్నికై ముఖ్యమంత్రి అయిన రామారావు గారికి వారి సహచరుడు నాదెండ్ల భాస్కర్‌రావే వెన్నుపోటు పొడిచి పదవీచ్యుతుడిని చేశాడు. అయితే హీరో కదా మళ్లీ శత్రువులని జయించి సీఎం అయ్యాడు ఆయన. అయితే 1994లో రెండవసారి వెన్నుపోటు మాత్రం కాస్త బలంగా దిగి, పీఠం దిగిపోవలసి వచ్చింది. ఆరుగురు కొడుకులున్నా, అల్లుడిదే పైచేయి అయి, నారా వారికి కాలం కలిసివచ్చి, ఏడాది తిరగకుండానే ముఖ్యమంత్రి మారాడు. ఇక 1995-1999 దాకా, తర్వాత బీజేపీ సహాయంతో మళ్లీ 1999-2004 దాకా అప్రతిహతంగా ఉమ్మడి ఏపీకి సీఎంగా వెలిగాడు బాబు. మొదట్లో కొన్ని నెలల ఇబ్బంది పడ్డా, జనవరి 1996లో ఎన్టీఆర్ మర ణం తర్వాత రంధి లేకుండాపోయింది చంద్రబాబుకు, దిక్కులేకుండా పోయింది తెలంగాణకి! మళ్లీ ఆ నారా యుగం ఎలా ఉండిందో చూద్దాం.

మొట్టమొదటగా ఆంధ్రుల పొలాలకు అవసరమైన నీళ్లు నిరాఘాటంగా పారిపోయి తెలంగాణను ఎడారి చేశాయి. ఊళ్లల్లో పనులు లేక తెలంగాణ పల్లెల నుంచి రైతుల్లో చాలా భాగం హైదరాబాద్‌కు వచ్చి కూలీలుగా, పరిశ్రమల్లో వర్కర్స్‌గా రైతుకూలీలు లేబర్లయిపోయారు. ఇక స్కూళ్లల్లో పంతుళ్లను నియమించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చాలాభాగం మూతపడ్డాయి. పైగా విద్యారంగంలో నిధులు 80 శాతం ఆంధ్ర జిల్లాలకు, 20 శాతం తెలంగాణకు వస్తే మరి పంతుళ్లెక్కడ నుంచి వస్తారు? పంతుళ్లు లేరని పిల్లలు మానేసి, సరైన సంఖ్య లేదని స్కూళ్లు మూతపడి, ఆ పిల్లలు కూడా తల్లిదండ్రులతో హైదరాబాద్‌లో చిన్న కూలీలై పోయారు.

ఇక కొద్దిగా ఉద్యోగస్థులు, పైసలున్నవాళ్ల పిల్లలను ఉద్ధరించటానికి ఆంధ్ర విద్యావేత్తలు చంద్రబాబు గారి ప్రాపకంలో హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడి, ఇబ్బడిముబ్బడిగా తమ సంస్థలను పెంచేశారు. దూరదృష్టి ఉన్న రామారావు గారే ఇంజినీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్ వగైరా కోర్సులకు ఎంసెట్ పరీక్షను కలిపి గుంటూరు, తెనాలి, విజయవాడ నుంచి వారి కోచింగ్ మాస్టర్స్‌ను హైదరాబాద్ రప్పించారు. ఇక బాబు హయాంలో వారి సంస్థలు, సంపదలు బ్రహ్మాండంగా పెరిగాయి. మా స్కూలు రోజుల్లో మొద్దు పిల్లలు ట్యూషన్లకు వెళ్లేవాళ్లు. మాకు కనపడకుండా మొహాలు కప్పుకొని పరిగెత్తేవాళ్లు. కానీ, ఆంధ్రా సంస్కృతి ఇక్కడ నిండాక ట్యూషన్లకు వెళ్లనివాళ్లు అంటరాని వాళ్లయ్యారు. 10, 12 గంటలు తమ దగ్గరే విద్యార్థులను పెట్టుకొని, వారికి సామాజిక జీవితం, లోకజ్ఞానం లేకుండా చేసేవాళ్లు విద్యావేత్తలయ్యారు. ఇంగ్లీషులో 95 శాతం మార్కులు, ఇంగ్లీషు ముక్క మాట్లాడటం చాతకాదు! అదీ ఆంధ్ర విద్య అంటే! నిజాంల కాలంలో ఉర్దూ మీడియం వారికి కూడా ఇంగ్లీషు చక్కగానే నేర్పేవారు. ఆ కాలంలో ఇక్కడ డాక్టర్లయిన వాళ్ల దగ్గరికి ఇతర దేశాల వాళ్లు వైద్యానికి వచ్చేవాళ్లు.

ఇక తెలంగాణ యువతకు ఉద్యోగాలు లేక, వేరే దారి లేక అల్లాడారు బాబు కాలంలో. జిల్లాకు 300 మంది యువకులకు తక్కువ కాకుండా నక్సలైట్ల పేరుతో ఎన్‌కౌంటర్లకు బలయ్యారు. రైతులకు, ఇక్కడి యువతకు పనిపాటలు లేవు. అయితే, బాబు గారి కాలంలో మేలేం జరగలేదా అం